AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్‌గా సుమతిదేవి



**అక్షరటుడే, బాల్కొండ:** ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్‌గా సుమతిదేవి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ పోచంపాడ్ డీఈఈ, ఏఈలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.





## ‘స్వచ్ఛ ఏవం’కు పాఠశాలల ఎంపిక

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘‘స్వచ్ఛ ఏవం’’ హరిత విద్యాలయాల రేటింగ్ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో 8 పాఠశాలలు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. 16 అంశాలపై ఉన్నత ప్రమాణాలు పాటించి పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా శుభ్రంగా ఉంచడంతో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించాయి. ఈ పాఠశాలలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జ్ఞాపికలతో శుక్రవారం సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎంపికైన ఎనిమిది పాఠశాలలు రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నాయి. సుద్దపల్లి జెడ్పీహెచ్ఎస్, కంజర బాలికల గురుకులం, కోమన్ పల్లి జెడ్పీహెచ్ఎస్, బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్, లింగాపూర్ ప్రాథమిక పాఠశాల, మావంది కలాన్ ప్రాథమిక పాఠశాల, అంబం ప్రాథమికోన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.



## ఆఖరి రోజు.. నామినేషన్ల జోరు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సందడి నెలకొంది. ముఖ్యంగా శుక్రవారం నామినేషన్ల సమర్పణకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు క్యూకట్టారు. సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్లు సమర్పించేందుకు అభ్యర్థులు తరలిరావడంతో కేంద్రాలు సందడిగా మారాయి. అధికారులు సైతం అభ్యర్థులకు హెల్ప్‌డెస్క్ ద్వారా సూచనలు సలహాలు అందజేశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్మూర్ సబ్ కలెక్టర్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** మండలంలోని చౌటుపల్లి, కమ్మర్‌పల్లి క్లస్టర్‌లలో శుక్రవారం నామినేషన్ల సమర్పణకు చివరిరోజు కావడంతో సందడి నెలకొంది. ఈ మేరకు నామినేషన్ కేంద్రాలను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట కమ్మర్‌పల్లి తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాజ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

**ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల పర్వం ముగియడంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. అధికారులు సైతం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడత ఎన్నికలు ఈ నెల 11న జరగనున్నాయి. ఇప్పటికే అధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. కెమెరాల ద్వారా జిల్లా కేంద్రం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం నుంచి ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. అయితే మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది.** - అక్షరటుడే, ఇందూరు





# ఎన్నికలకు సిగ్నల్ ప్రాబ్లమ్

▸ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు ▸ సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు ▸ ఇంటర్నెట్ లేకపోవడంతో ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,077 గ్రామపంచాయతీలు, 9,678 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 5,053 పోలింగ్ కేంద్రాలు, కామారెడ్డి జిల్లాలో 4,670 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 286 సమస్యాత్మక, 104 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 164 సమస్యాత్మక కేంద్రాలు, 153 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే వీటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో, తండాల్లో ప్రైవేట్ నెట్‌వర్క్‌లతో పాటు బీఎస్ఎన్ఎల్‌కు సరైన సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

### ప్రత్యామ్నాయ మార్గాలు

ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయి. ఉన్నతాధికారుల సైతం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. అయితే వీటికి సిగ్నల్స్ అందకపోవడం పెద్ద సమస్యగా మారింది. ప్రధానంగా మారుమూల గ్రామాలు, తండాల్లో ఇంటర్నెట్ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. ఇప్పటికే అధికారులు సైతం వాటిని గుర్తించే పనిలో ఉన్నారు. సాధారణంగా చాలా వరకు గ్రామ పంచాయతీల్లో ఎక్కడా కూడా ఇంటర్నెట్ సౌకర్యం లేదు. అయితే ఎన్నికల సమయంలో సంబంధిత పోలింగ్ బూత్‌లలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



## టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో సుమారు మూడు వేల మంది ఉపాధ్యాయులపై ప్రభావం పడుతుందన్నారు. చాలా ఏళ్లుగా సేవ చేస్తున్న ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2010కి ముందు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.



## ఘనంగా శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాడ్వాయి మండల కేంద్రంలో సద్గురు శబరి మాతాజీ దివ్య పాదుకా పూజోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మదన్ మోహన్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి పాదుకలకు అభిషేకం చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, భక్తులకు స్వయంగా వడ్డన చేశారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సేవక బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మద్దతుదారుడు, సర్పంచ్ అభ్యర్థి ఉష సంతోష్ మేస్త్రి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉష సంతోష్ మేస్త్రిని గెలిపిస్తే మద్నూర్‌ను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాడని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సీనియర్ నేత నరాల రత్నాకర్



**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ సీనియర్ నేత రత్నాకర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మీనాక్షి నటరాజన్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో కలిసి రత్నాకర్ శుక్రవారం ఆమెను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై చర్చ జరిగిందని రత్నాకర్ పేర్కొన్నారు. ఆమెతో పలు విషయాలు చర్చించడం ఆనందంగా ఉందన్నారు.

## అవినీతికి వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ నిలబడాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రజలంతా అవినీతికి వ్యతిరేకంగా నిలబడాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా యాంటీ కరప్షన్ బ్యూరో ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుంచి ర్యాలీని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ప్రారంభించారు. పాత కలెక్టరేట్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాయిరెడ్డి పెట్రోల్ పంప్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అవినీతి వల్ల వచ్చే ఇబ్బందులను ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ గురువారం రాష్ట్ర రాజధానిలో ఒక క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లయితే క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు తెలియపర్చవచ్చన్నారు. అవినీతికి వ్యతిరేకంగా నిలబడి పేద మధ్యతరగతి ప్రజలకు అన్ని సర్వీసులు అందే విధంగా న్యాయం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



## విద్యావంతులను గెలిపిస్తే మరింత అభివృద్ధి: ఎమ్మెల్యే



**అక్షరటుడే, బోధన్:** విద్యావంతులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ డివిజన్‌లోని సాలూర, జాడిజమాల్‌పూర్ తదితర గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులుగా నిలబడిన కాంగ్రెస్ మద్దతుదారులతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కాంగ్రెస్ అంటే భరోసా అనే నమ్మకం కలిగిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోవాలని సూచించారు. జాడిజమాల్‌పూర్‌లో చిన్న వయసులో విద్యావంతురాలు నిహారిక సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయడం గ్రామస్థుల అదృష్టంగా భావించాలన్నారు. గ్రామంలో విద్యావంతురాలు ప్రజాప్రతినిధిగా ఉంటే ప్రజలకు ఉత్తమ సేవలు అందడంతో పాటు అభివృద్ధి సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పార్టీ బోధన్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సాలూర పీఏసీఎస్ ఛైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుందర్ రాజు, అల్లె రమేశ్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్ అభ్యర్థులు, ఏకగ్రీవమైన సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ దళాలకు మద్దతుగా ఉండాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు :** ప్రతి పౌరుడు సాయుధ దళాలకు మద్దతుగా నిలవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా.. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ శ్రమిస్తున్నారన్నారు. సైనికుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తిస్తూ వారి పట్ల వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. వారి గౌరవార్థం ప్రతి ఏటా జరిపే సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి మరింత అట్టహాసంగా నిర్వహించాలని సూచించారు. అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ సందర్భంగా సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం సహాయ నిధిని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.





## వామ్మో కుక్కలు..

నగరంలో కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీంతో రోడ్లపైకి రావాలంటేనే చిన్నారులు, వృద్ధులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. నగర శివారులోని లక్ష్మీప్రియ నగర్‌లో వీధికుక్కలు రోడ్లపై తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

గ్రామ పంచాయతీల్లో పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేకాధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.. దోమలు..ఈగల కారణంగా ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఇక కొత్త సర్పంచ్‌ల రాకతోనైనా గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే, బాన్సువాడ



# పారిశుధ్యంపై పట్టింపేది..?

■ డ్రెయినేజీలు సరిగ్గా లేక ఇబ్బందులు ■ పెరుగుతున్న వైరల్ ఫీవర్లు ■ నూతన పాలకవర్గాలపై ప్రజలు ఆశలు ■ పట్టించుకోని అధికారులు

పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దోమలు, ఈగలతో అనేక వ్యాధులు సంక్రమిస్తుంటాయి. పంచాయతీ ఎన్నికల అనంతరం నూతన పాలకవర్గాలు గ్రామ సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### కామారెడ్డి జిల్లాలో..

జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 532 గ్రామ పంచాయతీలున్నాయి. రెండేళ్లుగా పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడంతో నిధులు రాక పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య పనుల నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదు. అలాగే వీధి దీపాలు లేక పల్లె ప్రజలు రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండడంతో నిర్వహణ పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయన్న ఆశతో సొంత డబ్బులు ఖర్చు చేశారు. కొంతమంది కార్యదర్శులు బంగారాన్ని సైతం బ్యాంకులో కుదువపెట్టి పంచాయతీల్లో ఖర్చు చేశారు. వారు సైతం డబ్బులు రాకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పాలకవర్గాలు కొలువు తీరితేనే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి.





### బాన్సువాడ మండలంలో..

బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలో పలు వీధుల్లో మురుగు కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలైన డ్రెయినేజీలు, రోడ్లు లేక సతమతమవుతున్నారు. మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వస్తోంది. మురికినీరు నిలువ ఉండడంతో దోమలు పెరిగి వైరల్‌ఫీవర్లు సైతం పెరిగాయి. ఇప్పటికైనా కొత్త పాలకవర్గాలు తమను పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

**అక్షరటుడే, కామారెడ్డి:** గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ చేరికలపై దృష్టి పెట్టినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రతిరోజు పదుల సంఖ్యలో పార్టీలో చేరడానికి కార్యకర్తలు ఉత్సాహం చూపుతున్నారు. భిక్కనూర్ మండలంలోని తిప్పాపూర్, భిక్కనూర్ గ్రామాల నుండి పలువురు కార్యకర్తలు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి షబ్బీర్‌అలీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు.

## నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించాలని పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, పోచంపాడ్, వేల్పూర్, భీమ్‌గల్ మండలం జాగిర్యాల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ గ్రామ పంచాయతీలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించారు. మండలస్థాయి ఎన్నికల నిర్వహణ అధికారులతో నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై చర్చించి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్‌ను తనిఖీ చేశారు.





పోచంపాడ్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న మధురి రాజు



మద్నూర్‌లో నామినేషన్ వేస్తున్న ఉష..

## నామినేషన్ల సమర్పణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మూడో విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఈ మేరకు బాన్సువాడ డివిజన్, ఆర్మూర్ డివిజన్‌లలో శుక్రవారం అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బంధువర్గం, సహచరులు, ఆయా పార్టీల మద్దతుదారులు వెంటరాగా అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్ కార్యాలయానికి తరలివచ్చారు. అధికారులకు పత్రాలు సమర్పించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



బాన్సువాడ మండలం చిన్నరాంపూర్‌లో నామినేషన్ వేస్తున్న మల్లుగొండ..



## జోరందుకున్న యాసంగి నాట్లు

యాసంగి వరి నాట్లు జిల్లాలో జోరందుకున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. భూగర్భ జలాలు గణనీయంగా పెరగడంతో వ్యవసాయ బోర్లలో నీరు సమృద్ధిగా వస్తోంది. దీంతో రైతులు యాసంగి సాగుపై దృష్టి సారించారు. కోటగిరి మండలంలో జోరుగా నాటు వేస్తున్నారు.

- అక్షరటుడే, కోటగిరి

## తల్లి నామినేషన్.. అభ్యర్థిగా కొడుకు ప్రచారం



**అక్షరటుడే, కోటగిరి:** గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బరిలో నిలబడిన అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. తమను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీలు ఇస్తున్నారు. పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారంలో ఓ అభ్యర్థి తరపున కొడుకు ప్రచారం చేసుకుంటుండడం చర్చనీయాంశమైంది. ఎన్నికల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హంగర్గ ఫారంలో సర్పంచ్ అభ్యర్థిగా రజియా బేగం నామినేషన్ వేశారు. ఈ మేరకు ఆమె ప్రచారం చేయాల్సి ఉండగా.. ఆమె కుమారుడు ఎండీ ఫిరోజ్ సొంతంగా తన ఫొటోతో పోస్టర్లు ప్రింట్ చేసుకుని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. తల్లి ఫొటో కాకుండా తన ఫొటో పెట్టుకుని ప్రచారం చేస్తుండడంపై పలువురు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు వెంటనే పోస్టర్లను తొలగింపజేసి అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

## ఆలూర్‌లో వ్యక్తి దారుణ హత్య

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హతమార్చారు. సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండల కేంద్రంలో అర్ధరాత్రి గొల్ల పెద్దగంగారాం ఇంటి బయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని.. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మండల కేంద్రంలో అర్ధరాత్రివేళ హత్య జరగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

## విద్యారంగ అభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి

**అక్షరటుడే, ఇందూరు:** విద్యారంగ అభివృద్ధి కోసం ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు కృషి చేస్తున్నాయని జిల్లా గవర్నర్ ఎ.అమర్‌నాథ్ రావు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా రెండు వందలకు పైగా పాఠశాలలను లయన్స్ క్లబ్‌లు నడుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, గాజుల్ పేట్ ఫ్రెండ్స్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని గుర్బాబాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా గవర్నర్ ఎ.అమర్‌నాథ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు లయన్స్ క్లబ్‌లు కృషి చేస్తున్నాయన్నారు. పాఠశాలలు నడపడంతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కోశాధికారి మర్రి ప్రవీణ్, అదనపు కోశాధికారి లక్ష్మీనారాయణ, రీజియన్ ఛైర్మన్ ఉదయ సూర్యభగవాన్, కో-ఆర్డినేటర్ గజ్జెల నాగేశ్వరరావు, ప్రోగ్రాం ఛైర్మన్ గురుప్రసాద్, జోన్ ఛైర్మన్లు భూమన్న, బి.నర్సింహారావ్, జిల్లా ఛైర్మన్ జిల్కర్ విజయానంద్, గాజుల్ పేట్ ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షుడు చక్రధర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి.రాఘవేందర్, కోశాధికారి అంకం రాజేందర్, పూర్వాధ్యక్షులు ఇరుమల శివలింగం, చింతల గంగాదాస్, గుర్బాబాది పాఠశాల హెచ్‌ఎం చిన్న స్వామి, ఉపాధ్యాయులు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



## వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని బీసీ బాలబాలికల వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. శీతాకాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేస్తోందని ఎంపీడీవో సహారా బేగం తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వసతులు కల్పించాలని సంబంధిత వసతిగృహం అధికారులకు ఎంపీడీవో సూచించారు.




## రాష్ట్ర సైన్స్ ఎగ్జిబిషన్‌కు తరలిన విద్యార్థులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో విద్యార్థుల కోసం ఈఏడాది ప్రత్యేకంగా ఇగ్నైట్ 2025 పేరిట రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులు వెళ్లినట్లు ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లు లక్ష్మణ్ సింగ్, శిల్ప, ఉపాధ్యాయులు ప్రియదర్శిని, రాజశేఖర్, బలవంతరావ్, విద్యా రమణ పాల్గొన్నారు.



## ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి

**అక్షరటుడే, బోధన్:** పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాలూరలో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించడం.. భయం లేకుండా ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.



## అండర్–14 క్రికెట్ సెలక్షన్స్‌లో కామారెడ్డి క్రీడాకారుల ప్రతిభ

**అక్షరటుడే, కామారెడ్డి:** హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం అండర్-14 క్రికెట్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో కామారెడ్డికి చెందిన నలుగురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. కామారెడ్డికి చెందిన కార్తికేయ, మణికంఠ, సాయి అక్షిత్, మహమ్మద్ అర్హాన్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు క్రికెట్ కోచ్ రియాజుద్దీన్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో అండర్ 14 విభాగంలో ఒకరు సెలక్ట్ కాగా ఈసారి నలుగురు సెలక్ట్ కావడం అభినందనీయన్నారు.